సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
సోమవారం । 30 । డిసెంబర్ । 2024





## నిత్యాన్నదానానికి విరాళాలు

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి ముప్పిడి సత్యవాణి (కాకినాడ) రూ.లక్ష, కార్తి కేయ దత్తా కళ (సికింద్రాబాద్) రూ.1,01,116 చొప్పన శనివారం విరాళాలు సమర్పించారు.




## జోరుగా.. హుషారుగా..

8లో

సంక్రాంతి సంబరాల్లో భాగంగా రంగంపేట మండలం వడిశలేరు గ్రామ శివారు గన్నివారి పామాయిల్ తోట వద్ద ఆదివారం రాష్ట్ర స్థాయి ఎడ్ల బండ్ల పరుగు పోటీలు నిర్వహించారు.

## డెల్టాలకు 11,200 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు ఆదివారం 11,200 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 3,300, మధ్య డెల్టాకు 2,150, పశ్చిమ డెల్టాకు 5,750 క్యూసెక్కుల చొప్పన వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులకు చేరింది.

## న్యూస్‌రీల్

### డివిజన్ కేంద్రాల్లో నేడు ఎస్ఎంసీ శిక్షణ

రాయవరం: స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ డీఆర్పీలకు ఆదివారం ఒక రోజు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించాలని డీఈఓ డాక్టర్ షేక్ సలీం బాషా ఆదేశాలిచ్చారు. రామచంద్రపురం డివిజన్ పరిధిలో 25 మంది డీఆర్పీలకు మండల విద్యాశాఖ సమావేశ భవనంలో, అమలాపురం డివిజన్ పరిధిలో 50 మందికి అమలాపురం ఎంపీడీఓ సమావేశ భవనం, కొత్తపేట డివిజన్‌లో 35 మంది డీఆర్పీలకు కొత్తపేట ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో ఓరియంటేషన్ జరగనుంది. ఈ ప్రోగ్రామ్‌కు కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి బీవీవీ సుబ్రహ్మణ్యం జిల్లా నోడల్ అధికారిగా వ్యవహరిస్తారు. ప్రతి మండలం నుంచి ఇద్దరు ఎస్ఎంసీ చైర్మన్లు, ముగ్గురు ఉపాధ్యాయులు డీఆర్పీలుగా వ్యవహరిస్తారు. ఒక రోజు ఓరియంటేషన్ అనంతరం శిక్షణ పొందిన డీఆర్పీలు మండల స్థాయిలో జనవరి 2, 3 తేదీల్లో మండల స్థాయిలో శిక్షణ ఇవ్వనున్నారు. దీనికి ప్రతి పాఠశాల నుంచి ఒక హెచ్ఎం, ఎస్ఎంసీ చైర్మన్ హాజరు కానున్నారు.

### 4న జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు

అమలాపురం రూరల్: పి.గన్నవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జనవరి 4న జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు డీఈఓ షేక్ సలీమ్ బాషా ఆదివారం రాత్రి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతం మండల స్థాయిలో విద్యా వైజ్ఞానిక పోటీలు నిర్వహిస్తున్నామని అన్నారు. జిల్లా స్థాయి పోటీలకు 22 మండలాల నుంచి మండలానికి ఐదు ప్రాజెక్టుల చొప్పున 110 ప్రాజెక్టులను ఎంపిక చేస్తామన్నారు. జిల్లా విద్యా వైజ్ఞానిక ప్రదర్శనల కమిటీ చైర్మన్, జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, కమిటీ కన్వీనర్, డీఈఓ బాషా, డీవైఈఓ గుబ్బల సూర్యప్రకాశం, జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం పర్యవేక్షణలో పోటీలు జరుగుతాయని తెలిపారు. ఈ పోటీల్లో క్విజ్ ఫెయిర్ ప్రదర్శన, బుక్ ఫెయిర్ ప్రదర్శన, సైన్స్ రంగవల్లుల ప్రదర్శన, సైన్స్ తోలుబొమ్మల ప్రదర్శనలు ఉంటాయని వివరించారు. వీటిపై సందేహాలు ఉంటే జిల్లా సైన్స్ అధికారి సుబ్రహ్మణ్యం సెల్‌ఫోన్ నంబర్ 96401 88525కు చేసి నివృత్తి చేసుకోవాలని డీఈఓ విజ్ఞప్తి చేశారు.

### ఉద్యోగులకు మధ్యంతర భృతి ప్రకటించాలి





సమావేశంలో మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు దొరబాబు

ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు పోతంశెట్టి డిమాండ్

అమలాపురం టౌన్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రభుత్వం తక్షణమే మధ్యంతర భృతి (ఐఆర్) ప్రకటించాలని, పాత పీఆర్సీ బకాయిలను చెల్లించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు పోతంశెట్టి దొరబాబు డిమాండ్ చేశారు. స్థానిక మద్దాలవారిపేటలో ఆదివారం జరిగిన అమలాపురం పట్టణ ఎస్టీయూ సమావేశంలో ఆయన మాట్లాడారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని సూచించారు. మున్సిపల్ ఉపాధ్యాయులకు నిల్వలో ఉన్న పీఎఫ్ సొమ్మును వెంటనే చెల్లించాలన్నారు. అనంతరం పలు సమస్యలపై చర్చించి తీర్మానాలు చేశారు. ఎస్టీయూ పట్టణ అధ్యక్షుడు ఎస్.బాలకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ పళ్లంరాజు, జిల్లా నాయకులు ఎన్.సత్యనారాయణ, ఆర్ఆర్‌కే ప్రసాద్, ఎంఎస్ఎన్ మూర్తి, మొయిద్దీన్. కె.సౌజన్య తదితరులు ప్రసంగించారు.

### కౌలురైతు ఆత్మహత్య



మృతుడు రాంబాబు

మలికిపురం: మట్టపర్రు గ్రామంలో ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన కౌలురైతు తాడి రాంబాబు (53) శనివారం మృతి చెందాడు. ఈ విషయం ఆదివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అనారోగ్యం కారణంగా అతడు ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్సై సురేష్ చెప్పారు. అయితే, రాంబాబు స్థానికంగా సుమారు ఐదెకరాలు సాగు చేసి అప్పుల పాలై, శుక్రవారం పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు గ్రామానికి చెందిన సరిహద్దు రైతు తాడి నరసింహారావు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సురేష్ తెలిపారు.

# కదిలే కాలంలో మజిలీలెన్నో..

- **అనుభవాలను మూటగట్టిన 2024**
- **జిల్లాలో వివిధ పార్టీల అధినేతల పర్యటన**
- **కూటమి పాలనపై అన్నదాతల ఆగ్రహం**
- అతలాకుతలం చేసిన వరదలు, వర్షాలు
- క్రీడా రంగంలో ఖ్యాతిని కొనసాగించిన సాత్విక్
- సహజ వనరులను కొల్లగొడుతున్న కూటమి నేతలు

కపిలేశ్వరపురం: కదిలే కాలంలో ఓ మజిలీ ముగిసింది.. 2024 ఎన్నో అనుభవాలను మూటగట్టింది.. క్యాలెండర్‌లో పేజీతో పాటు రాష్ట్ర ప్రభుత్వమూ మారింది. కొత్త ప్రభుత్వ పాలనా తీరు ప్రజల తలరాతలను తలకిందులు చేసింది. జిల్లాలో వర్షాలు, వరద నష్టాలను కలిగించాయి. అన్ని రంగాల ప్రజలు ఈ ఏడాది సగం రోజులు సంక్షేమం, తర్వాత ప్రజా వ్యతిరేక పాలనను చవిచూసేలా చేసింది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన రెండో రోజే కపిలేశ్వరపురం తదితర చోట్ల గోదావరి గట్టున ఉంచిన ఇసుక నిల్వలను మెక్కేసే ప్రయత్నాలు జరిగాయి. అలా మొదలైన కూటమి పాలన జిల్లాలో ఇసుక, మట్టి ఇతర సహజ వనరులను వశపరుచుకునే పనిలో పడింది. తమ ఇంటి తలుపు తట్టి తలలో నాలుకగా మెలిగిన వైఎస్ జగన్ పాలనను జారవిడుచుకున్నామన్న సంగతిని జిల్లా ప్రజలు 2024 సంవత్సరంలోనే తెలుసుకున్నారు. ఇదంతా ఎలా జరిగిందబ్బా అని ఆలోచిస్తుంటే ఎన్నికలకు ముందు చంద్రబాబు, పవన్ కళ్యాణ్ చేష్టలు గుర్తు చేసుకుంటున్నారు. ప్రజా పాలనను ఓడించేందుకు దుష్ట చతుష్టయం సర్వశక్తులను ఒడ్డిన విషయం తేటతెల్లమైంది. రావులపాలెం, మండపేట తదితర ప్రాంతాల్లో వారిద్దరి మాటలకూ, సీఎం అయ్యాక వానపల్లిలో చంద్రబాబు పర్యటనలో వ్యవహారం శైలికి తేడా స్పష్టంగా కనిపించింది. అద్దంలో స్వర్గాన్ని చూపించి నమ్మించిన సంగతి తెలిసింది. కారణం ఏదైతేనేమి, కూటమి ప్రభుత్వం వచ్చింది. ఎన్నికలకు ముందు సంపద సృష్టిస్తానన్న చంద్రబాబు.. అధికారంలోకి వచ్చాక ప్రభుత్వం దగ్గర మంత్రం దండం ఏమైనా ఉంటుందా అంటూ ఓటేసిన ప్రజలను ప్రశ్నించడం కనిపించింది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రోడ్ల అధ్వానమంటూ ఉపన్యాసాలతో ఊదరగొట్టిన బాబు సీఎం అయ్యాక జిల్లాలో గుంతలు మాత్రమే పూడ్చిస్తున్నారు. రోడ్డు వేయాలంటే 'టోల్' తీయక తప్పదంటున్నారు. అమలాపురం ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణం ఊసెత్తడం లేదు. జిల్లాలోని వరి, ఉద్యాన పంటల సాగు రైతులకు చిల్లిగవ్వ సాయం కూడా చేయలేదు. వీటితో పాటు జిల్లాలో విద్యా, ఉద్యోగ, పారిశ్రామిక, క్రీడా, సాధారణ పాలనా రంగాల్లో అనేక అంశాలు చోటు చేసుకున్నాయి. వాటి సమాహారమే 2024 వత్సరం..



ధాన్యం డబ్బులు చెల్లించాలంటూ అమలాపురంలో కలెక్టరేట్ గేట్ దాటుకుని వెళ్తున్న రైతులను అడ్డుకుంటున్న పోలీసులు (ఫైల్)



జిల్లాలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ప్రచారం (ఫైల్ )



వానపల్లిలో మాట్లాడుతున్న చంద్రబాబు (ఫైల్)




**జనవరి:**

- మలికిపురంలో 5వ తేదీన నిర్వహించిన వైఎస్సార్ సీపీ రాష్ట్ర వ్యాప్త సామాజిక సాధికార బస్సు యాత్రకు జనం పోటెత్తారు. మంత్రులు, నేతలకు జనం నీరాజనం పలికారు.
- 12న అమలాపురానికి చెందిన భారత్ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ శెట్టి జోడీ మలేషియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్ 1000 టోర్నీలో వరుసగా రెండోసారి సెమీ ఫైనల్‌కు చేరుకున్నారు.
- 31న ఆడుదాం ఆంధ్ర జిల్లా స్థాయి పోటీలు అమలాపురంలో ప్రారంభమయ్యాయి. విశాఖపట్నంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు ఫిబ్రవరి 8న జిల్లా నుంచి 92 మంది క్రీడాకారులు తరలివెళ్లారు.

**ఫిబ్రవరి:**

- గ్రామ రెవెన్యూ సహాయకులకు 5వ తేదీన రూ.500 డీఏ పెంచినందుకు అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వీఆర్ఏ సంఘం ఆధ్వర్యంలో అమలాపురంలో కృతజ్ఞతా సమావేశం నిర్వహించారు.
- 6న వక్కలంకలోని ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను డీజీఐజెడ్ జర్మనీ సంస్థ, అంతర్జాతీయ వరి పరిశోధన స్థానం, ఓలం అగ్రి గ్లోబల్ మార్కెటింగ్ సంస్థ ప్రతినిధులు సందర్శించారు. రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ఆచరిస్తున్న వ్యవసాయ పద్ధతులను ప్రతినిధులు ప్రశంసించారు.
- 14న రూ.45 కోట్ల అంచనాతో అమలాపురం బస్టాండ్ నిర్మాణానికి అప్పటి మంత్రి పినిపే విశ్వరూప్, ఆర్టీసీ ఎండీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు శంకుస్థాపన చేశారు.

**మార్చి:**

- జిల్లాలో 33,500 మంది విద్యార్థులకు రూ.25.80 కోట్ల విలువైన జగనన్న విద్యా దీవెన ఆర్థిక సాయాన్ని 1వ తేదీన తల్లుల ఖాతాలకు జమ చేశారు.
- 14న అగ్రవర్ణ పేదలకు వైఎస్సార్ ఈబీసీ నేస్తం పథకం మూడో విడత సాయం జమ చేశారు. 11,496 మందికి రూ.17.24 కోట్ల లబ్ధి చేకూరింది.

**ఏప్రిల్:**

- జిల్లాలోని రావులపాలెం, ద్రాక్షారామలో 3వ తేదీన ప్రజాగళం పేరుతో టీడీపీ అధినేత నారా చంద్రబాబు పర్యటించారు.
- 18న అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేమంతా సిద్ధం సభ పేరుతో రావులపాలెంలో పర్యటించారు.
- 29న అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంబాజీపేటలో పర్యటించగా జనం బ్రహ్మరథం పట్టారు.

**మే:**

- 5న సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో భాగంగా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 15,201 మందికి తొలిరోజు 6,927 మంది ఓటు వేశారు.
- 13న సార్వత్రిక ఎన్నికలు నిర్వహించారు. జిల్లాలో 15,31,410 ఓటర్లకు గానూ 14,84,008 మంది ఓటు వేయడంతో 83.84 శాతం ఓటింగ్ నమోదైంది. ఇది ఉమ్మడి జిల్లాలో ప్రథమ స్థానం దక్కించుకుంది. ఎన్నికల్లో 106 మంది అభ్యర్థులు పోటీ పడ్డారు.

**జూన్:**

- 4న సార్వత్రిక ఎన్నికల ఫలితాలు విడుదలయ్యాయి. అమలాపురం ఎంపీ స్థానంతో పాటు జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజక వర్గాల్లో కూటమి అభ్యర్థులు గెలిచారు.

**జూలై:**

- 22, 29వ తేదీల్లో ధాన్యం డబ్బులు చెల్లించాలంటూ అమలాపురం కలెక్టరేట్ వద్ద సమీప ప్రాంతాల రైతులు ధర్నా చేశారు. కష్టం తాలూకు ఫలితాన్ని సకాలంలో ఇవ్వకపోవడంతో అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టరేట్ గేటు దాటుకుని వెళ్తుండగా పోలీసులు అడ్డుకున్నారు.
- పంట పాలుపోసుకునే దశలో వర్షాలతో దిగుబడి తగ్గింది.

**ఆగస్టు:**

- 11న ఎస్సీ వర్గీకరణ తీర్పును నిరసిస్తూ మాల మహానాడు జేఏసీ ఆధ్వర్యంలో అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో బహిరంగ సభ నిర్వహించారు.
- సీఎం హోదాలో చంద్రబాబు 23న తొలిసారిగా కొత్తపేట మండలం వానపల్లిలో ఎన్ఆర్ఈజీఎస్ గ్రామసభలో పాల్గొన్నారు. సమస్యలు చెప్పుకొనేందుకు వెళ్లాలనుకున్న మాల మహానాడు కార్యకర్తలను పోలీసులు అడ్డుకుని అరెస్ట్ చేశారు.
- 27న అమలాపురంలో అఖిల భారత కొబ్బరి రైతు సదస్సు నిర్వహించారు. లాభసాటి ధర సాధించేందుకు 2011 నాటి సాగు సమ్మె తరహాలో ఉద్యమించాలని తీర్మానించారు.
- 29న రెండు నెలలుగా నీటి సమస్య పట్టిపీడిస్తుండటాన్ని నిరసిస్తూ మలికిపురం మండలం రామరాజులంక మహిళలు పంచాయతీ కార్యాలయానికి తాళం వేసి నిరసన తెలిపారు.

**సెప్టెంబర్:**

- 1న తమ పొట్టకొట్టొద్దంటూ, ఉద్యోగ భద్రత కల్పించాలని అమలాపురంలోని ఏపీ బెవరేజెస్ లిమిటెడ్ లిక్కర్ డిపో పరిధిలో ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న సిబ్బంది ఆందోళనకు దిగారు. ముమ్మిడివరం, మలికిపురం, అంబాజీపేటలలో నిరసన తెలిపారు.

**అక్టోబర్:**

- 16న కొత్త మద్యం పాలసీలో భాగంగా ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పని చేస్తున్న సుమారు 2 వేల మంది అవుట్ సోర్సింగ్ సిబ్బందిని ప్రభుత్వం తొలగించింది.
- 21న కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీలను నెరవేర్చాలంటూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గ్రేడ్-2 ఏఎన్ఎంలు కాకినాడ జిల్లా కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు.
- 30న కలెక్టరేట్‌లో జిల్లా అభివృద్ధి కమిటీ సమన్వయ సమావేశంలో 22 శాఖల పరిధిలో కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరుపై జరిగిన చర్చలో విపక్ష ప్రజా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలను అధికారులు చెప్పలేకపోయారు.
- 30న నేషనల్ హైవే కన్సల్టింగ్ కమిటీ సభ్యుడిగా జిల్లాకు చెందిన ఎంపీ పిల్లి సుభాష్‌చంద్ర బోస్ నియమితులయ్యారు.

**నవంబర్:**

- 25న వలంటీర్ల వ్యవస్థ లేదంటూ శాసన మండలిలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి చెప్పడాన్ని రాష్ట్ర వలంటీర్ల అసోసియేషన్, ఏఐవైఎఫ్ నాయకులు అమలాపురంలో ఖండించారు.

**డిసెంబర్:**

- ఈ నెల 5న ఉమ్మడి జిల్లాలో వైద్య ఆరోగ్య శాఖలో హెల్త్ అసిస్టెంట్లు (ఎంపీహెచ్ఏ-ఎం) 138 మందిని తొలగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.
- 5న ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ ఉప ఎన్నిక పోలింగ్ నిర్వహించారు. జిల్లాలో 22 పోలింగ్ కేంద్రాల్లో 3,296 మందికి గాను 3,138 మంది ఓటు వేశారు. 9న లెక్కింపు నిర్వహించగా పీడీఎఫ్ అభ్యర్థి గోపిమూర్తి 3,906 ఓట్ల ఆధిక్యతతో గెలుపొందారు.
- 13న వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు రైతు సమస్యలపై పార్టీ ఆధ్వర్యంలో అమలాపురం జిల్లా కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టారు.
- 21న మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినోత్సవం సందర్భంగా జిల్లాలో వేడుకలు నిర్వహించారు. పలు సేవా కార్యక్రమాలను చేపట్టారు.
- 27న విద్యుత్ చార్జీల పెంపుదలను నిరసిస్తూ జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన ప్రదర్శనలు విజయవంతం అయ్యాయి.

# నాణ్యతకు తిలోదకాలు

రోడ్డు నిర్మాణంపై ప్రజల ఆందోళన

ఐ.పోలవరం: బీటీ రోడ్డు నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్ నాణ్యతకు తిలోదకాలు ఇచ్చినా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆందోళనకు దిగారు. ఐ.పోలవరం మండలం కేశనకుర్రు పంచాయతీ పరిధి నాగమల్లి చెట్టు నుంచి వృద్ధ గౌతమీ ఏటిగట్టుపై సుమారు 1130 మీటర్ల మేరకు బీటీ రోడ్డు పనులకు ఎన్ఆర్ఈజీఎస్ నుంచి రూ.99 లక్షలు మంజూరయ్యాయి. ఈ పనిని ఓ కాంట్రాక్టర్‌కు అప్పగించారు. పనులు చేసేటప్పుడు ఏటిగట్టు బెర్ములకు నాణ్యత లేని మట్టిని వేస్తున్నారని గ్రామస్తులు ఆందోళనకు దిగారు. ఆ పనులను గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు పిన్నమరాజు వెంకట పతిరాజు, ఇందుకూరి రంగరాజు, మోకా రవితో పాటు గ్రామస్తులు పరిశీలించి, పనుల్లో డొల్లతనాన్ని గుర్తించి సంబంధిత అధికారులకు సమాచారం అందించారు. ఏటిగట్టు రహదారి వేసేటప్పుడు అప్రోచ్ రోడ్డు కోసం పక్కన పటిష్టంగా ఉన్న ఏటిగట్టుకు తూట్లు పొడిచి ఆ మట్టినే అప్రోచ్ రోడ్డుగా వేయడం వల్ల వరదల సమయాల్లో గండ్లు పడే ప్రమాదముందని పేర్కొన్నారు. తాము అభివృద్ధిని అడ్డుకోబోమని పనుల్లో నాణ్యత ప్రమాణాలు లోపిస్తే ప్రశ్నిస్తామని హెచ్చరించారు. ఈ ప్రాంతాన్ని పంచాయతీరాజ్ అధికారులు పరిశీలించారు. నాణ్యత లేనిచోట సరి చేయిస్తామని నాయకులకు హామీ ఇచ్చారు.



రహదారి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, గ్రామస్తులు

# విద్యార్థులకు 'ఆప్తా' స్కాలర్‌షిప్‌లు

అమలాపురం టౌన్: అమెరికన్ ప్రోగ్రెసివ్ తెలుగు అసోసియేషన్ (ఆప్తా) స్టూడెంట్ ఎడ్యుకేషనల్ ప్రోగ్రామ్‌లో భాగంగా ఉభయ గోదావరి ఉమ్మడి జిల్లాల్లోని సుమారు 400 మంది విద్యార్థులకు రూ.2.50 కోట్లతో స్కాలర్ షిప్‌లు సమకూర్చింది. ఈ స్కాలర్ షిప్‌ల పంపిణీని అమలాపురంలోని డాక్టర్ మెట్ల సత్యనారాయణరావు కాపు కల్యాణ మండపంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆప్తా సంస్థ ప్రారంభించింది. దీని కోసం ఆప్తా అధ్యక్షుడు ముద్రగడ త్రినాథ్ ఆధ్వర్యంలో అమెరికా నుంచి ఆ అసోసియేషన్‌కు చెందిన 15 మందితో కూడిన బృందం అమలాపురం వచ్చి ప్రతిభ ఆధారంగా ఎంపిక చేసిన విద్యార్థులకు స్కాలర్ షిప్‌లు అందజేసింది. నల్లా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ నల్లా పవన్‌కుమార్ నిర్వహణలో సభ జరిగింది. ఆప్తా ప్రతినిధులుగా అమెరికా నుంచి వి.లక్ష్మీకాంతం, గోపాల్ గూడపాటి, బోగాది రితీస్, పసుపులేని గీతా కిషోర్, మంచిగంటి లక్ష్మీదీప్తి తదితరులు హాజరయ్యారు. ఆప్తా అమెరికా దేశం వేదికగా మన తెలుగు వారు ఎక్కడున్నా పలు రూపాల్లో సేవ చేస్తూ ఉంటామని ఆ అసోసియేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు. అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, మాజీ మున్సిపల్ చైర్మన్ నల్లా విష్ణుమూర్తి, కోనసీమ షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు మెట్ల రమణ బాబు, ఏఎస్పీ నల్లా సూర్య చంద్రరావు, జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు అధికారి వెంకట జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినికి స్కాలర్ షిప్ అందజేస్తున్న ఆప్తా ప్రతినిధులు, జిల్లా నాయకులు

## భజే గణనాయకా..



విశేష అలంకరణలో అయినవిల్లి విఘ్నేశ్వరస్వామి

అయినవిల్లి: భజే గణనాయకా అంటూ ఆ స్వామివారిని భక్తజనం కొలిచింది.. అయినవిల్లి విఘ్నేశ్వర స్వామివారి ఆలయం ఆదివారం భక్తులతో పోటెత్తింది. ఆలయ ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో స్వామివారికి మేలు కొలుపుసేవ, ఏకాదశ, లఘున్యాస, రుద్రాభిషేకాలు, వివిధ ప్రత్యేక పూజలు చేశారు. స్వామికి మహానివేదన అనంతరం వివిధ పుష్పాలతో అర్చక స్వాములు సర్వాంగ సుందరంగా అలంకరించారు. స్వామివారి లఘున్యాస, ఏకాదశ రుద్రాభిషేకాల్లో 39 మంది, లక్ష్మీగణపతి హోమంలో 17 మంది, పంచామృతాభిషేకాల్లో ఇరువురు దంపతులు పాల్గొన్నారు. నలుగురు చిన్నారులకు నామకరణ, అక్షరాభ్యాసం, తులాభారం, 25 మంది నూతన వాహన పూజలు జరిపారు. స్వామివారి నిత్యాన్నదాన పథకంలో 2,140 మంది అన్నప్రసాదం స్వీకరించారు. ఆలయానికి వివిధ పూజలు, అన్నదాన విరాళాలుగా రూ.2,02,54 ఆదాయం లభించిందని ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.

# బీచ్ వాలీబాల్ పోటీల విజేత తమిళనాడు

సాక్షి, అమలాపురం/ ఉప్పలగుప్తం: ఉప్పలగుప్తం మండలం ఎస్.యానం సముద్ర తీరంలో జరుగుతున్న జాతీయ స్థాయి మహిళా బీచ్ వాలీబాల్ పోటీల ఫైనల్స్‌లో తమిళనాడు జట్టు విజేతగా నిలవగా, చెన్నై వేల్స్ యూనివర్సిటీ జట్టు ద్వితీయ స్థానం సాధించింది. తమిళనాడు - చెన్నై వేల్స్ యూనివర్సిటీల మధ్య ఆదివారం రాత్రి ఫైనల్స్ జరిగింది. తొలి సెట్‌లో తమిళనాడు జట్టు 22-20 తేడాతో, రెండో సెట్‌లో వేల్స్ యూనివర్సిటీ జట్టు 21-16 తేడాతో ఉండగా, కీలకమైన మూడో సెట్‌లో తమిళనాడు జట్టు వేల్స్ యూనివర్సిటీ జట్టుపై 15-12తో గెలిచి విజేతగా నిలిచింది. మూడో స్థానంలో పుదుచ్చేరి జట్టు నిలిచింది. ఆంధ్రప్రదేశ్ జట్టు నాల్గో స్థానంలో నిలిచింది. ఆంధ్రప్రదేశ్, పుదుచ్చేరిల మధ్య హోరాహోరీ పోరు జరిగింది. శనివారం జరిగిన లీగ్ మ్యాచ్‌తో పాటు ఆదివారం రాత్రి మూడు, నాలుగు స్థానాలకు జరిగిన పోరులో తొలి మ్యాచ్ నువ్వా నేనా అన్నట్టు జరిగింది. రెండు జట్లు గెలుపు కోసం శ్రమించాయి. ఈ మ్యాచ్‌ను ఆంధ్రా జట్టు 27-25 తేడాతో గెలిచింది. రెండో మ్యాచ్ నువ్వా నేను అన్నట్టు జరిగింది. పుదుచ్చేరి జట్టు 22-20 తేడాతో విజయం సాధించింది. కీలకమైన మూడో మ్యాచ్ సైతం ఆసక్తిగా సాగింది. ఈ మ్యాచ్ 15 పాయింట్లకు నిర్వహించగా, పుదుచ్చేరి 17-15 తేడాతో గెలిచింది. ఆంధ్రా జట్టు ఓడినా అద్భుతమైన ప్రతిభతో ప్రేక్షకుల మన్ననలు పొందింది. విజేతలకు ప్రభుత్వ విప్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావులు బహుమతులు అందజేశారు.

**ఆటను మించిన భజన**

ఎస్.యానాంలో జరిగిన బీచ్ వాలీబాల్ పోటీల్లో క్రీడాకారుల ఆట ప్రదర్శన కన్నా కూటమి నేతల భజనకు అధిక సమయం కేటాయించారు. పోటీలు నిర్వహించిన అమలాపురం ఎమ్మెల్యే ఆనందరావు మించిన వారు లేరని వచ్చిన ప్రతి నాయకుడు మైకులు పగిలేలా మాట్లాడుతూ పోటీలు చూసేందుకు వచ్చిన వారి సహనాన్ని పరీక్షించారు.



జాతీయ స్థాయి మహిళా బీచ్ వాలీబాల్ పోటీల్లో పాల్గొన్న వివిధ రాష్ట్రాల క్రీడాకారిణులు

# ఎస్సీ వర్గీకరణతో కులాల్లో చిచ్చు

మాజీ ఐఆర్ఎస్ అధికారి పీఎస్ఎన్ మూర్తి

అమలాపురం రూరల్: ఎస్సీ కులాల్లోని ఐక్యతను విడగొట్టేందుకు రాజకీయ పార్టీలు ఎస్సీ వర్గీకరణ అంశాన్ని తెరపైకి తెచ్చి కుట్రలు పన్నుతున్నాయని మాజీ ఐఆర్ఎస్ అధికారి పీఎస్ఎన్ మూర్తి ధ్వజమెత్తారు. ఆయా రాజకీయ పార్టీల నేతలు వారి ప్రయోజనాల కోసం ఎస్సీలపై విషం కక్కుతున్నారని మండిపడ్డారు. అమలాపురం నడిపూడి పంచాయతీ డాబా గార్డెన్‌లో ఆదివారం జరిగిన పాత్రికేయుల సమావేశంలో మూర్తి మాట్లాడారు. రాజకీయ నాయకులు ఓటు బ్యాంక్ కోసం ఎస్సీలను విడగొట్టేందుకు వర్గీకరణ అంశాన్ని తెరపైకి తీసుకు వచ్చారన్నారు. మాలలను టార్గెట్ చేస్తూ విష ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఎస్సీ వర్గీకరణపై ఏడుగురు సభ్యుల జడ్జీలతో కూడిన సుప్రీంకోర్టు బెంచ్ ఇచ్చిన తీర్పు చెల్లుబాటు కాదని, 13 మంది జడ్జీలతో కూడిన బెంచ్ తీర్పునిస్తేనే అది చెల్లుబాటు అవుతుందన్నారు. ఎస్సీ వర్గీకరణను ఆంధ్రాలో కొన్ని వర్గాలు తప్ప దేశంలో అన్ని వర్గాలు వ్యతిరేకిస్తున్నాయని స్పష్టం చేశారు. బడుగు, బలహీన వర్గాల ఎదుగుదలను నిలుపుదల చేయాలన్న ఉద్దేశంతోనే భారత రాజ్యాంగానికి విరుద్ధంగా ఎస్సీ వర్గీకరణ తీర్పును చెప్పించారన్నారు. ఎస్సీ వర్గీకరణ చెల్లదని ప్రజలకు వివరించేందుకు ఆంధ్రప్రదేశ్ ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని మూర్తి చెప్పారు. ఇందులో భాగంగా ఈ జిల్లా నుంచి అవగాహన సదస్సులకు శ్రీకారం చుట్టామన్నారు. న్యాయవాది ఐఎస్ మల్లేశ్వరరావు, ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు బత్తుల నకులరాజు, కార్యదర్శి బంగార్రాజు పాల్గొన్నారు.



సమావేశంలో మాల మహానాడు నాయకులతో ఐక్యత చాటుతున్న మూర్తి

## నేడు యథావిధిగా గ్రీవెన్స్

అమలాపురం రూరల్: జిల్లా స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) సోమవారం ఉదయం 10 గంటల నుంచి యథావిధిగా జరగనుంది. దీనిని అమలాపురంలోని జిల్లా కలెక్టరేట్ గోదావరి భవన్‌లో నిర్వహిస్తామని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అర్జీదారులు తమ సమస్యలను జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకువచ్చి పరిష్కార మార్గాలు పొందాలని ఆయన విజ్ఞప్తి చేశారు. జిల్లా స్థాయితోపాటు డివిజన్, మండల స్థాయిలో గ్రీవెన్స్ జరుగుతుందన్నారు.

## అంబాజీపేట కొబ్బరి మార్కెట్



| కొబ్బరి రకం | ధర (రూ.ల్లో) |
|---|---|
| కొత్తకొబ్బరి (క్వింటాల్) | 12,000 – 12,500 |
| కొత్తకొబ్బరి (రెండవ రకం) | 9,500 – 10,000 |
| **కురిడీ కొబ్బరి (పాతవి)** | |
| గండేరా (వెయ్యి) | 17,500 |
| గటగట (వెయ్యి) | 16,000 |
| **కురిడీ కొబ్బరి (కొత్తవి)** | |
| గండేరా (వెయ్యి) | 16,800 |
| గటగట (వెయ్యి) | 15,000 |
| నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి) | 13,000 – 14,000 |
| కొత్త (పచ్చి)కాయ (వెయ్యి) | 11,000 – 11,500 |
| కొబ్బరి నూనె (15 కిలోలు) | 3,750 |
| ఒక కిలో | 260 |

## క్లుప్తంగా

### మహిళ మృతి



గొల్లపల్లి విశాలాక్షి (ఫైల్)

**కాకినాడ క్రైం:** కాకినాడ జీజీహెచ్ సైకియాట్రీ వార్డులోని ప్రత్యేక గదిలో మనో వేదనకు చికిత్స పొందుతూ ఈ నెల 24వ తేదీన ఆత్మహతికి యత్నించిన కాకినాడ గ్రామీణం మండలం కొవ్వాడ గ్రామానికి చెందిన గొల్లపల్లి విశాలాక్షి (33) శనివారం రాత్రి మృతి చెందింది. మానసిక అనారోగ్యం తీవ్రమై విపరీత ప్రవర్తనతో అసాధారణంగా ప్రవర్తించగా, ఆమెకు సంరక్షణగా ఉన్న తల్లిదండ్రులు వైద్యుల్ని తీసుకు వచ్చేందుకు పక్క వార్డుకు వెళ్లారు. ఈ లోపు అక్కడే ఉన్న అగ్గిపెట్టె తీసుకొని తన గౌనుకు నిప్పంటించుకుంది. తల్లిదండ్రులు, వైద్యులు ఆమెను కాపాడే లోపే 70 శాతానికి పైగా దేహం కాలిపోయింది. దీంతో క్షతగాత్రురాలిని సర్జికల్ భవంతిలో ఉన్న బర్న్స్ వార్డులో ఉంచి చికిత్స అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో మల్టీ ఆర్గాన్ ఫెల్యూర్ సంభవించి విశాలాక్షి శనివారం రాత్రి మృతి చెందింది.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**ముమ్మిడివరం:** మోటారు సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తిని ఆటో ఢీకొనడంతో మృతి చెందాడు. అయినవిల్లి మండలం మాగాంకు చెందిన నక్కా సోమశేఖర్ (32) ఆదివారం ఉదయం మోటారు సైకిల్‌పై వెళ్తుండగా అనాతవరం వాటర్ ప్లాంట్ వద్ద వెనుక నుంచి ట్రక్ ఆటో ఢీకొంది. అతనిని అమలాపురంలోని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. సోమశేఖర్‌కు భార్య అశ్విని ఉన్నారు. ఆమె ఫిర్యాదు మేరకు ఎస్సై డి.జ్వాలాసాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### పోక్సో కేసు నమోదు

**ధవళేశ్వరం:** బాలిక అదృశ్యం ఘటనకు సంబంధించి పోక్సో కేసు నమోదు చేసినట్లు ధవళేశ్వరం సీఐ టి.గణేష్ తెలిపారు. ఈ సంఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి.. ధవళేశ్వరం గ్రామానికి చెందిన బాలిక అదృశ్యమైనట్లు ఫిర్యాదు రావడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. బాలిక ఆచూకీ తెలుసుకున్న పోలీసులు అందుకు కారణమైన ముద్దాయి పేర్ల జాన్‌ను అరెస్ట్ చేశారు.

# పల్లె సీమలకు వలసజీవులు

- ఊరూరా వ్యవసాయ పనిముట్ల విక్రయం
- మధ్యప్రదేశ్ వాసుల జీవన గమనం
- రోడ్లపైనే తయారీ, విక్రయ కేంద్రాలు



వ్యవసాయ పనిముట్ల తయారీలో భాగంగా సమ్మెట కొడుతున్న మహిళ

**రాయవరం:** జీవనోపాధి కోసం శ్రమజీవులు రాష్ట్రాలు దాటి వలస వస్తున్నారు.. బతుకు తెరువుకు గ్రామాలకు వస్తూ జీవనం గడుపుతున్నారు. ఆకలికి రుచి తెలియదు, నిద్ర సుఖమెరగదు అన్నది సామెత వీరిని చూస్తే నిజమేననిపిస్తుంది. కనీసం నిలువ నీడ లేని ఈ కుటుంబాలు ఉపాధిని వెతుక్కుంటూ వేల కిలోమీటర్లు ప్రయాణం చేస్తున్నాయి. ఊరూరా తిరుగుతూ, వ్యవసాయ పరికరాలు తయారు చేసుకుంటూ మధ్యప్రదేశ్ వాసులు బతుకు పోరాటం సాగిస్తున్నారు. వ్యవసాయ పనుల్లో నిత్యం ఉపయోగించే కత్తి, గొడ్డలి, గునపం తదితర పనిముట్లతో పాటు ఇంట్లో వాడే కత్తి పీటలను మధ్యప్రదేశ్ వాసులు తయారు చేస్తున్నారు. ఆ రాష్ట్రంలోని సాగర్, భోపాల్ తదితర ప్రాంతాలకు చెందిన సుమారు వంద కుటుంబాలు ఈ పనుల కోసం మన ప్రాంతానికి వచ్చాయి. వీరు ఆయా గ్రామాల్లో రహదారి పక్కనే తాత్కాలిక నివాసముంటూ అక్కడే వ్యవసాయ పరికరాలు తయారు చేసి విక్రయాలు చేస్తున్నారు. వస్తువులకు ఉన్న డిమాండ్‌ను బట్టి రెండు, మూడు రోజులు అక్కడే ఉంటున్నారు. ఆ తర్వాత మరో ఊరికి వలస వెళ్లిపోతున్నారు.

**కళ్లెదుటే చేస్తూ..**

తమతో తీసుకువచ్చిన ఇనుప రాడ్లను రైతుల ముందే కొలిమిలో కాల్చి, వారు కోరిన విధంగా పనిముట్లను తయారు చేయడం మధ్యప్రదేశ్ వాసుల ప్రత్యేకత. ఒక్కో పనిముట్టును దాని బరువు ఆధారంగా రూ.100 నుంచి రూ.500 వరకూ విక్రయిస్తారు. ఇలాంటి పనిముట్లు స్థానికంగా దుకాణాల్లోనూ లభిస్తాయి. కానీ వాటి నాణ్యత బాగోదని రైతులు చెబుతున్నారు. తమ కళ్లముందే మధ్యప్రదేశ్ పరికరాలు తయారు చేస్తున్నారని, వాటి నాణ్యత బాగుంటుదని చెబుతున్నారు. అందుకే వీటికి ఇప్పుడు డిమాండ్ ఏర్పడుతోంది.



రహదారిపై వ్యవసాయ పరికరాలు విక్రయిస్తున్న మధ్యప్రదేశ్ వాసి

**వలస బాట..**

మధ్యప్రదేశ్ నుంచి వచ్చిన వీరందరూ ఏడాదిలో దాదాపు పది నెలల పాటు బయట రాష్ట్రాల్లో తిరుగుతారు. ఆంధ్రప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌లోని పలు గ్రామాల్లో జీవనం సాగిస్తారు. అక్కడి రైతులకు కావాల్సిన వ్యవసాయ పరికరాలు తయారు చేస్తారు. ప్రస్తుతం వీరందరూ నవంబర్ నుంచి మన రాష్ట్రంలో తిరుగుతున్నారు. వ్యవసాయ పరికరాల తయారీలో పురుషులతో మహిళలు, బాలలు చెమటోడుస్తున్నారు. ఇనుమును కటింగ్ చేసే సమయంలో మగవారితో సమానంగా సమ్మెట దెబ్బలు వేస్తున్నారు. కొలిమిని మండించడం, తయారు చేసిన వస్తువులను విక్రయించడం వంటి పనులు చేస్తూ సాయంగా ఉంటున్నారు.

**చదువుకు పిల్లలు దూరం**

తల్లిదండ్రులతో పాటే వలస జీవితం సాగించే చిన్నారులు పూర్తిగా చదువుకు దూరమవుతున్నారు. పదేళ్ల వయసున్న వారు సైతం సమ్మెట దెబ్బలు వేస్తూ తల్లిదండ్రులకు సహాయం చేస్తున్నారు. పాఠశాలకు వెళ్లడం లేదా అని ప్రశ్నిస్తే ముందు పొట్టగడవాలి కదా అని తల్లిదండ్రులు సమాధానమిస్తున్నారు. భోపాల్ పరిసర ప్రాంతాల్లో టెంట్లు వేసుకుని జీవనం సాగిస్తామని, తమకు నిలువ నీడ లేదని వివరిస్తున్నారు.

**ఏటా వలస బాట**



జీవనోపాధి కోసం ఏటా ఇలా వలస వచ్చేస్తాం. ఒక్కో గ్రామంలో తిరుగుతూ ఏడాదిలో దాదాపు పది నెలల పాటు బయటే గడుపుతాం. అన్ని రాష్ట్రాలలో వ్యవసాయ పనిముట్లను తయారు చేసి, అమ్మకాలు సాగిస్తుంటాం. రైతులు మా పనిముట్లను ఆదరిస్తున్నారు.

– ఫరబత్ లోహర్, భోపాల్, మధ్యప్రదేశ్

**పరికరాలు బాగున్నాయి**



మధ్యప్రదేశ్ వాసులు తయారు చేస్తున్న వ్యవసాయ పరికరాలు చాలా బాగున్నాయి. మా కళ్లెదుటే నాణ్యతగా తయారు చేస్తున్నారు. దీంతో మాకు నచ్చిన విధంగా వాటిని తయారు చేయించుకుంటున్నాం. వీరి పనిముట్లను అందరూ కొనుగోలు చేస్తున్నారు.

– వల్లూరి వెంకటేశ్వరరావు, కౌలు రైతు, రాయవరం

## సెంట్రల్ జైలుకు 200 మంది కొత్త ఖైదీలు

**కంబాలచెరువు (రాజమహేంద్రవరం):** రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు 200 మంది శిక్ష ఖైదీలు రానున్నారు. విశాఖపట్నం జైలులో పరిమితికి మించి ఖైదీలు ఉండడంతో వారిని రాజమహేంద్రవరం జైలుకు పంపేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు జైళ్లు ఉండగా, స్థానికత ఆధారంగా దగ్గరలోని జైలులో మాత్రమే రిమాండ్, శిక్షకు పంపాలని జీఓ ఉంది. దీని ప్రకారం విశాఖలోని ఖైదీలు రాజమహేంద్రవరం వచ్చేందుకు వీలు లేదు. అయితే విశాఖపట్నం జైలులో వెయ్యి మంది ఖైదీల ఉండేందుకు మాత్రమే వీలుంది. ఆ రీజియన్ పరిధిలో ఇటీవల కాలంలో అధిక సంఖ్యలో కేసులు రావడం, వారిలో అధికంగా గంజాయి నిందుతులకు రిమాండ్ విధించారు. దీంతో ఆ సంఖ్య రెండు వేలకు పెరిగింది. ఆ జైలులో ఖైదీల వసతికి తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. ఈ నేపథ్యంలో కొంతమందిని రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు పంపేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఏపీ జైళ్ల శాఖ డీఐజీ రవికిరణ్ 'సాక్షి'కి తెలిపారు.

**ములాఖత్ పరిస్థితి ఏంటి?**

విశాఖ జైలులో ఖైదీల తరలింపు ప్రక్రియకు జైళ్ల శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో 200 మంది రాజమహేంద్రవరం రానున్నారు. ఇందులో నిరుపేద, ఆర్థికంగా ఇబ్బందులు పడే ఖైదీల కుటుంబాలు ఉన్నాయి. వీరంతా రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు వచ్చి తమ వారిని ములాఖత్‌లో కలవాలంటే వ్యయ, ప్రయాసలకు గురికావాల్సి వస్తుంది. రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో 1,200 మంది ఖైదీలు ఉండేందుకు అవకాశం ఉంది. అయితే ఇక్కడ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 1,900 మంది ఖైదీలు ఉన్నారు. ఇందులో 700 మందిని స్థానికత ఆధారంగా నెల్లూరు జైలుకు 250 మంది, విజయవాడకు 100 మంది, ఏలూరు జైలుకు కొంత మందిని బదిలీలు చేశారు.

## రాష్ట్రాన్ని అప్పుల్లోకి నెట్టేస్తోంది బాబే!

- విద్యుత్ చార్జీల పేరుతో ప్రజలపై భారం
- ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు ధ్వజం



విలేకర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు, వైఎస్సార్ సీపీ నాయకులు

**అమలాపురం టౌన్:** సంపద సృష్టిస్తానని పదే పదే ప్రచారం చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేస్తున్నాడని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు ధ్వజమెత్తారు. ఆర్థిక సంస్కరణల పేరుతో సంప్రదాయబద్ధంగా ఉన్న విద్యుత్ శాఖను ఓ ప్రయోగశాలగా మార్చి ఇప్పుడు చార్జీల పెంపుతో ప్రజల నడ్డివిరుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అమలాపురం హైస్కూల్ సెంటర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఉదయం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్సీ మాట్లాడారు. వైఎస్సార్ సీపీ 2019లో అధికారంలోకి వస్తే, చంద్రబాబు 2000 సంవత్సరం నుంచి పలు దఫాలు ముఖ్యమంత్రిగా పనిచేసి ఆర్థిక సంస్కరణల పేరుతో అన్ని వ్యవస్థలను చిన్నాభిన్నం చేశారని గుర్తు చేశారు. విద్యుత్ సంస్కరణ పేరుతో రూ.15 వేల కోట్ల భారాన్ని ప్రజలపై మోపుతున్న చంద్రబాబు ప్రజా వ్యతిరేకతపై స్పందించి ఇప్పుడు శాసనసభలో పెరిగిన విద్యుత్ చార్జీలు వద్దని తీర్మానం చేయవచ్చు కదా...? అని ఎమ్మెల్సీ ప్రశ్నించారు. ఎంత సేపూ వైఎస్సార్ సీపీ చేసిన నిర్వాకమని విద్యుత్ చార్జీలపై తప్పించుకునే ధోరణిలో మాట్లాడడం సరికాదని స్పష్టం చేశారు. అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు కూడా ఇదే పాట పాడుతున్నారని, విద్యుత్ చార్జీల పెంపు గత ప్రభుత్వంపై నెట్టే ప్రయత్నాన్ని ఎమ్మెల్సీ తీవ్రంగా ఖండించారు. సంపద సృష్టిస్తానని, సంస్కరణలు చేస్తానని గొప్పలు చెప్పుకునే చంద్రబాబు నేడు అన్నింటికీ అప్పుల కోసం పరుగులు పెట్టి రాష్ట్రాన్ని అప్పుల ఊబిగా మార్చారని విమర్శించారు. రోడ్ల మరమ్మతులు, అమరావతి అభివృద్ధి ఇలా ప్రతీ రంగంలోనూ అప్పులు చేసి అప్పులాంధ్ర ప్రదేశ్ చేస్తున్నది మీరు కదా....? అని చంద్రబాబును ఎమ్మెల్సీ ప్రశ్నించారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, పార్టీ లీగల్ సెల్ జిల్లా మాజీ అధ్యక్షుడు కుడుపూడి త్రినాథ్, పార్టీ నాయకుడు ముంగర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## వివాహిత ఆత్మహత్య



కుమారి మృతదేహం

**నిడదవోలు రూరల్:** భర్త మద్యానికి బానిసయ్యాడనే మనస్తాపంతో ఓ వివాహిత ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుందని సమిశ్రగూడెం ఎస్సై కె.వీరబాబు ఆదివారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. నిడదవోలు మండలం డి.ముప్పవరానికి చెందిన కొళ్ల త్రినాథ్‌కు కుమారి (27)తో ఐదేళ్ల క్రితం వివాహమైంది. త్రినాథ్ మద్యం తాగుతుండడంతో భార్యభర్తల మధ్య తరచూ గొడవలు జరిగేవి. ఆదివారం మధ్యాహ్నం తీవ్ర మనస్తాపానికి గురైన కుమారి క్షణికావేశంతో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మృతి చెందినట్లు ఎస్సై వీరబాబు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## సత్యదేవుని సన్నిధిలో డిజిటల్ పేమెంట్స్

సాక్షి ఇంపాక్ట్

**అన్నవరం:** సత్యదేవుని భక్తులకు శుభవార్త. అన్నవరంలో సత్యదేవుని వ్రతం, దర్శనం టిక్కెట్ల కొనుగోలు, స్వామివారి అన్నదాన పథకం, గో సంరక్షణ ట్రస్ట్‌లకు విరాళాలు సమర్పించేందుకు ఫోన్‌పే, పేటీఎం, గూగుల్ పే, క్రెడిట్ కార్డు, డెబిట్ కార్డులతో పేమెంట్ చేసేలా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు దేవస్థానం ఈఓ వి.సుబ్బారావు ఆదివారం తెలిపారు. దేవస్థానంలో డిజిటల్ పేమెంట్లు లేకపోవడంతో భక్తులు పడుతున్న ఇబ్బందులపై ఈ నెల 26న 'సాక్షి' దినపత్రికలో 'రొక్కమే దిక్కు' శీర్షికన కథనం వచ్చింది. 2024 జనవరి 21న కూడా 'నోటుపాట్లు' శీర్షికన కథనం ప్రచురితమైంది. 'సాక్షి'లో వచ్చిన కథనాలకు స్పందించిన ఈఓ సుబ్బారావు పశ్చిమ రాజగోపురం వద్ద, రామాలయం సమీపంలోని పీఆర్వో కార్యాలయం వద్ద డిజిటల్ పేమెంట్స్‌కు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఆదివారం పీఆర్వో కార్యాలయంలో ఏర్పాటు చేసిన కౌంటర్‌లో డిజిటల్ పేమెంట్లను ప్రారంభించారు. సోమవారం పశ్చిమ రాజగోపురం వద్ద కౌంటర్‌లో ఈ టిక్కెట్లు జారీ చేయనున్నారు. కాగా, ప్రసాదం ప్యాకెట్ల కొనుగోలుకు ప్రస్తుతం డిజిటల్ పేమెంట్ల ద్వారా అవకాశం లేకపోయినా రెండు, మూడు రోజుల్లో అందుకు ఏర్పాట్లు చేయనున్నారు.



పశ్చిమ రాజగోపురం వద్ద ఏర్పాటు చేసిన డిజిటల్ పేమెంట్స్ కౌంటర్



సాక్షి

రొక్కమే దిక్కు!

ఈ నెల 26న 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన 'రొక్కమే దిక్కు' కథనం

## వేట్లపాలెంలో రెవెన్యూ, పోలీసుల పర్యటన

- హత్యా ఘటనలపై ఇరువర్గాలతో భేటీ
- న్యాయం చేయాలని బాధితుల డిమాండ్

**సామర్లకోట:** వేట్లపాలెం మంగాయ్యమ్మ కాలనీలో ఈ నెల 15న ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు హత్యకు గురి కావడంతో గ్రామంలో పరిస్థితిని రెవెన్యూ, పోలీసు అధికారులు ఆదివారం సమీక్షించారు. హత్యలు జరిగినప్పటి నుంచి మంగాయ్యమ్మ కాలనీ వద్ద పోలీసు పికెటింగ్ కొనసాగుతోంది. రెండు కుటుంబాల (కార్దాల, బచ్చల కుటుంబాల) మధ్య ఉన్న ఇంటి నిర్మాణం ఆక్రమణ పేరుతో దాడి చేసి ముగ్గురు వ్యక్తులను దారుణంగా హత్య చేసిన విషయం విదితమే. ఈ దాడిలో కార్దాల చంద్రరావు, కార్దాల ప్రకాశరావు, కర్దాల ఏసులు మృతి చెందారు. హత్య కేసులో ప్రధాన నిందితుడు బచ్చల బుజ్జియ్యను అరెస్టు చేయక పోవడంతో బాధిత కుటుంబాలకు చెందిన వారు తమకు ప్రాణ భయం ఉందని, చనిపోయిన కుటుంబాలకు న్యాయం చేయాలని ఇటీవల జిల్లా కలెక్టర్‌కు కర్దాల కుటుంబ సభ్యులు, ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబుతో కలసి వినతి పత్రం అందజేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కాకినాడ ఆర్డీఓ ఎస్.మల్లిబాబు, పెద్దాపురం డీఎస్పీ డి.శ్రీహరిరాజుల ఆధ్వర్యంలో మంగాయ్యమ్మ కాలనీలో పర్యటించారు. బాధిత కుటుంబ సభ్యుల నుంచి సమాచారం సేకరించారు. దాడికి ప్రధాన నిందితుడైన బచ్చల బుజ్జియ్యను ఎందుకు అరెస్టు చేయలేదని బాధిత కుటుంబానికి చెందిన మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. పెద్దాపురం మండలం గోరింట గ్రామంలో బుజ్జియ్య బంధువుల ఇంట్లో ఉన్నాడని ఫిర్యాదు చేశారు. తమ కుటుంబ సభ్యులకు బెదిరింపులు వస్తున్నాయని కర్దాల కుటుంబ సభ్యులు ఆరోపించారు. అనుమానం ఉన్నవారి పేర్లు ఇస్తే వారిని అరెస్టు చేస్తామని డీఎస్పీ చెప్పారు. బాధిత కుటుంబంలో ఒక దివ్యాంగురాలు అనాధగా మిగిలిందని ఆమెకు న్యాయం చేయాలని, కుటుంబ పెద్దలను కోల్పోవడంతో పోషణ కష్టంగా మారిందని, బాధితులకు ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలు ఇప్పించాలని ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు ఆర్డీఓ మల్లిబాబు దృష్టికి తీసుకు వెళ్లారు. ఈ విషయాన్ని జాయింట్ కలెక్టర్ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లి న్యాయం జరిగే విధంగా చేస్తామని ఆర్డీఓ మల్లిబాబు భరోసా ఇచ్చారు. రెండు వర్గాలకు చెందిన వారు ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వారు కావడంతో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు వర్తించదని, ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచే సహాయం అందాలని అధికారులు తెలిపారు. ప్రశాంత జీవనం గడిపేలా రెండు వర్గాలకు చెందిన వారితో డీఎస్పీ శ్రీహరిరాజు మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ వై.శ్రీనివాసు, సీఐ ఎ.కృష్ణభగవాన్, క్రైమ్ సీఐ అంకబాబు పాల్గొన్నారు.



వేట్లపాలెంలో బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఆర్డీఓ, డీఎస్పీ తదితరులు

## జోరుగా.. హుషారుగా



పరుగు పందెంలో పాల్గొన్న ఎడ్లు

- ఎడ్ల పోటీలకు అపూర్వ స్పందన
- పది గంటల పాటు నిర్వహణ
- రాష్ట్ర వ్యాప్తంగా 63 జతల ఎడ్లు రాక

**రంగంపేట:** సంక్రాంతి సంబరాల్లో భాగంగా రంగంపేట మండలం వడిశలేరు గ్రామ శివారు గన్నివారి పామాయిల్ తోట వద్ద ఆదివారం రాష్ట్ర స్థాయి ఎడ్ల బండ్ల పరుగు పోటీలు నిర్వహించారు. రాష్ట్ర సాంస్కృతిక వ్యవహారాలు, పర్యాటక శాఖల మంత్రి కందుల దుర్గేష్ ఆదివారం ఉదయం పోటీలను ప్రారంభించగా, సాయంత్రం రాష్ట్ర శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డిలు విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. దివంగత ఆదర్శ రైతు గన్ని సత్యనారాయణ మూర్తి స్మారకార్థం ఆయన కుమారుడు రాజానగరం జీఎస్ఎల్ వైద్య కళాశాల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు సహకారంతో కూటి కోటేశ్వరరావు, బొప్పన బ్రహ్మాజీరావుల నిర్వహణలో ఈ పోటీలు జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ సాగిన పోటీలకు న్యాయ నిర్ణేతలుగా కృష్ణా జిల్లాకు చెందిన సూరపనేని రాధాకృష్ణప్రసాద్, కాకినాడ జిల్లాకు చెందిన చేకూరి రామకృష్ణ వ్యవహరించారు. రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల నుంచి 63 జతల ఎడ్లు పాల్గొనగా, 1,600 మీటర్ల సీనియర్స్ విభాగంలో 18, వెయ్యి మీటర్ల జూనియర్స్ విభాగంలో 45 జతల ఎడ్లు పాల్గొన్నాయి. రంగంపేట– వడిశలేరు గ్రామాల మధ్య ఏడీబీ రోడ్డు పక్కన గన్నివారి పామాయిల్ తోట వద్ద ఈ పోటీలు నిర్వహించారు. దీంతో రెండు గ్రామాల మధ్య ఏడీబీ రోడ్డు పోటీలు తిలకించడానికి వచ్చిన జనంతో కళకళలాడింది. పోలీసుల గట్టి బందోబస్తు నడుమ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా పోటీలు ప్రశాంతంగా జరిగాయి.

**సంప్రదాయాలకు ఎంతో ప్రాధాన్యం**

వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ తెలుగు సంస్కృతీ సంప్రదాయాల్లో ఎడ్ల బండ్ల పోటీలకు ఎంతో ప్రాధాన్యం ఉందన్నారు. డాక్టర్ గన్ని భాస్కరరావు గడిచిన ఐదేళ్లుగా రాష్ట్ర స్థాయి ఎడ్ల బండ్ల పోటీలను ఎంతో ఘనంగా నిర్వహించారని, నేడు ఆరోసారి అంతే వైభవంగా పోటీలు నిర్వహించి సంప్రదాయాలకు ప్రాణం పోశారన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా యువత పాశ్చాత్య సంస్కృతికి అలవాటు పడుతున్న తరుణంలో మన సంప్రదాయాలను వారికి తెలియజేయాలనే ఉద్దేశంతో నిర్వహిస్తున్న ఈ పోటీలకు ఏటా ఆదరణ పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి వాసు, బత్తుల బలరామకృష్ణ, మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, వైఎస్సార్ సీపీ నాయకులు షర్మిళారెడ్డి, జక్కంపూడి గణేష్, డాక్టర్ గూడూరి శ్రీనివాస్, గన్ని కృష్ణ పాల్గొన్నారు.

**విజేతలు వీరే..**

రాష్ట్ర స్థాయి ఎడ్ల బండ్ల పోటీల్లో సీనియర్స్, జూనియర్స్ విభాగాల్లో ప్రథమ విజేతలకు బుల్లెట్ బైక్‌లు, ద్వితీయ, తృతీయ విభాగాల్లో విజేతలకు హోండా షైన్ బైక్‌లను శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి చేతుల మీదుగా అందజేశారు. సీనియర్స్ విభాగంలో 18 జతల ఎడ్లు పాల్గొనగా మొదటి బహుమతి కోనసీమ జిల్లా గుమ్మిలేరుకు చెందిన కోరా శృతి చౌదరి, రెండో బహుమతి అనకాపల్లి జిల్లా కేజీపురానికి చెందిన శ్రీఆంజనేయం, మూడో బహుమతిని కోనసీమ జిల్లా గుమ్మిలేరుకు చెందిన కోరా శృతి చౌదరి గెలుచుకున్నారు. జూనియర్స్ విభాగంలో 45 జతల ఎడ్లు పాల్గొనగా, మొదటి బహుమతి కోనసీమ జిల్లా మండపేటకు చెందిన వేగుళ్ల కృష్ణ మాధవి, రెండో బహుమతి కోనసీమ జిల్లా గుమ్మిలేరుకు చెందిన కోరా శృతి చౌదరి, మూడో బహుమతి నెల్లూరు జిల్లా, గంగపట్నంకు చెందిన చాముండేశ్వరి సీఫుడ్స్ వారు గెలుచుకున్నారు. మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ వైద్య ప్రపంచంలో గౌరవాన్ని తెచ్చిన డాక్టర్ గన్ని భాస్కరరావు ఇలాంటి సంప్రదాయ పోటీలు క్రమం తప్పకుండా నిర్వహించడం విశేషమన్నారు.



పోటీలను తిలకించేందుకు వచ్చిన జనం



ఎడ్ల బండ్ల పోటీలు ప్రారంభిస్తున్న పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్